క్లుప్తంగా

ముస్లింలకు ఎమ్మెల్సీ ఇఫ్తార్ విందు



ముస్లింలకు విందు వడిస్తున్న ఎమ్మెల్సీ మహమ్మద్‌ఇక్బాల్, ఎంపీ గోరంట్ల మాధవ్

హిందూపురం: స్థానిక ఆల్‌హిలాల్ ఈద్గా మైదానంలో పవిత్ర రంజాన్ మాసం పురస్కరించుకుని ఉపవాస దీక్షలు చేపడుతున్న ముస్లింలకు శుక్రవారం రాత్రి ఎమ్మెల్సీ ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ఎంపీ గోరంట్ల మాధవ్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ఎన్ని తీర్థయాత్రలు చేసినా ఎన్ని సార్లు ప్రార్థనలు చేసినా పక్కవారికి సహాయం చేయకపోతే అంతా వ్యర్థమన్నారు. పక్కవాడు ఆకలితో ఉంటే నీవు కడుపునిండా తింటే దానిని అల్లా క్షమించడన్నారు. రంజాన్ అంటే త్యాగానికి, దానానికి ప్రతీక.. దీనిని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘనీ, మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్‌రెడ్డి, ముత్తవల్లిలు నూరుల్లా, సిద్దిక్‌సెట్, కలీంసాబ్, గఫూర్‌సాబ్, అంజాద్‌సాబ్, అతావుల్లా నాయకులు చందు, లతీఫ్‌సెట్, ఖలీల్, రహమత్, నజీర్, ఇలియాజ్, తదితరులు పాల్గొన్నారు.

సిద్ధరూఢస్వామి రథోత్సవం

అమరాపురం: తమ్మడేపల్లి గ్రామానికి వెళ్లే రహదారిలో ఉన్న సిద్ధరూఢస్వామి రథోత్సవం శుక్రవారం ఘనంగా భక్తులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం స్వామికి ఆలయంలో అర్చకుడు సిద్దేశ్వర సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం తదితర పూజలు చేశారు. అనంతరం భక్తులు తెచ్చిన వివిధ పూలతో స్వామి వారిని అలంకరించి మహా మంగళహారతి ఇచ్చారు. సాయంకాలం స్వామి ఉత్సవ విగ్రహాన్ని తీసుకొచ్చి రథంలో కొలువు దీర్చారు. అనంతరం పూజలు చేసి రథాన్ని తమ్మడేపల్లిలో ఉన్న మూల విరాట్ స్వామి వారి పాదుకట్ట వద్దకు లాగారు. ఈ సందర్భంగా భక్తులు పూలు, బెల్లం తదితర వాటిని రథం పైకి విసరి మొక్కులు తీర్చుకున్నారు. అక్కడ స్వామి వారికి ప్రత్యేకంగా పూజలు చేశారు. ఈ సందర్భంగా అలసంద, ఉలవలతో కూడిన గుగ్గిళ్లను స్వామి వారికి నైవేద్యం పెట్టి పూజల అనంతరం భక్తులకు పంచి పెట్టారు. రాత్రి రథాన్ని ఆలయం వద్దకు తిరిగింపు చేశారు.

నేడు ఆసరా సంబరాలు

రొళ్ల: స్థానిక లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఆవరణలో శనివారం ఉదయం 10 గంటలకు వైఎస్సార్ ఆసరా మూడో విడత సంబరాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రామారావు తెలిపారు. ఎమ్మెల్యే తిప్పేస్వామి హాజరై మహిళ సంఘాల సభ్యులకు మెగా చెక్కు అందిస్తారన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు, డ్వాక్రా మహిళలు పాల్గొనాలని కోరారు.

గోవుల గంగమ్మకు జ్యోతులు

లేపాక్షి: మండలంలోని కల్లూరు-కొండూరు రహదారిలో వున్న గోవుల గంగమ్మ దేవతకు నాయనిపల్లి ఎస్సీ కాలనీ వాసులు శుక్రవారం ఉదయం జ్యోతులను మోశారు. నాయనిపల్లి నుంచి దేవాలయం వరకూ సుమారు రెండు కిలోమీటర్లు తప్పెట్లతో ఊరేగింపుగా వెళ్లారు. అక్కడ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జ్యోతులను అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

పోషకాహారంపై అవగాహన కల్పించాలి

హిందూపురం టౌన్: అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహారం అందించడంతో పాటు రక్తహీనత, పోషకాహారంపై అవగాహన కల్పించాలని ఐసీడీఎస్ సీడీపీఓ రెడ్డి రమణమ్మ సూచించారు. శుక్రవారం చౌడేశ్వరీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించి పోషక పదార్థాలను ప్రదర్శించారు. సూపర్‌వైజర్ శాంతి, మున్సిపాలిటి 2 సెక్టర్ అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక వివాహాలు



వరుడికి తాళిబొట్టు అందిస్తున్న నంజావధూతస్వామి, రఘువీరారెడ్డి

మడకశిరరూరల్: నీలకంఠాపురంలోని నీలకంఠేశ్వరస్వామి సన్నిధిలో ఆలయ కమిటీ చైర్మన్ ఎన్ రఘువీరారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత సామూహిక వివాహాలు ఘనంగా జరిగాయి. తొలుత సీతారాముల కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం కర్ణాటక రాష్ట్రం పట్టనాయకనహళ్లి శ్రీనంజావధూత స్వామి ఆశీర్వాదంతో 15 నూతన జంటలకు వివాహాలు జరిగాయి. శ్రీనంజావధూత స్వామి, రఘువీరారెడ్డి కుటుంబ సభ్యులు నూతన జంటలకు తాళిబొట్లు, కొత్త బట్టలు, కాలిమెట్లను అందించారు. ప్రముఖ సంగీత దర్శకుడు వందేమాతరం శ్రీనివాస్, రచయిత జేకే భారవి నీలకంఠాపురం సముదాయ దేవస్థానంపై పాడిన 8 భక్తి గీతాలను ఆవిష్కరించారు.మాజీ ఎమ్మెల్యే సుధాకర్, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక స్వావలంబనే ధ్యేయం



మడకశిరలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి



హాజరైన మహిళలు



హిందూపురం: చెక్కు అందిస్తున్న ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్

- ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిర: అక్కచెల్లెమ్మల ఆర్థిక స్వావలంబనే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే తిప్పేస్వామి పేర్కొన్నారు. పట్టణంలోని షిర్డీసాయిబాబా ఆలయ ఆవరణలో శుక్రవారం వైఎస్సార్ ఆసరా పథకం మూడో విడత సంబరాలు జరిగాయి. మండలంలోని 995 సంఘాల్లోని 9,839 మంది సభ్యులకు రూ.5.67 కోట్లు, మడకశిర అర్బన్ పరిధిలోని 427 సంఘాల్లోని 4,285 సభ్యులకు రూ.2.93 కోట్ల మెగాచెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కేక్ కట్ చేయడంతోపాటు సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సాధికారత కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం డ్వాక్రా రుణాలను మాఫీ చేస్తుండడంతో మహిళలు ఎంతో ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఎన్నికల సమయంలో డ్వాక్రా రుణాలను మాఫీ చేస్తామని చెప్పి అధికారంలోకి రాగానే మాట తప్పిన వంచకుడు చంద్రబాబు అని విమర్శించారు. తమ ప్రభుత్వంలో రాజకీయంగా మహిళలకు 50 శాతం అవకాశాలు లభిస్తున్నాయని తెలిపారు. మహిళల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌దేనని తెలిపారు. అమ్మ ఒడి, చేయూత, విద్యాదీవెన, విద్యావసతి, ఆసరా తదితర పథకాల ద్వారా మహిళల్లో ఆర్థిక స్వావలంబన పెరిగిందన్నారు. మహిళలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు అండగా ఉండాలని కోరారు.చంద్రబాబు చెప్పే మాయమాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ నళిని, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, వైస్ చైర్‌పర్సన్ వెంకటలక్ష్మమ్మ, ఎంపీపీ కవిత, జెడ్పీటీసీ సరోజమ్మ, ఎంపీడీఓ సోనిబాయి, కమిషనర్ ప్రభాకర్‌రావు, ఏరియా కోఆర్డినేటర్ ప్రసాద్, మెప్మా అధికారి సదానందం, వైస్ ఎంపీపీలు శ్రీరామరెడ్డి, మూర్తి, మున్సిపాలిటీ జేసీఎస్ కన్వీనర్ విక్రమ్, నాయకులు నాగేంద్ర, సత్యనారాయణరెడ్డి, జమ్మానిపల్లి మూర్తి, అంజన్, అన్సర్, జయరాజ్, మంజునాథ్, మండల సమాఖ్య అధ్యక్షురాలు జయమ్మ, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే సంక్షేమాభివృద్ధి

- ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్

హిందూపురం: వైఎస్సార్‌సీపీతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని అక్కచెల్లెమ్మలు, పేదవర్గాలకు ఆర్థిక పరిపుష్టి కల్పించడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ అన్నారు. శుక్రవారం బెంగళూరురోడ్డులోని ఆర్‌కే ఫంక్షన్‌హాల్‌లో ఎంపీడీఓ నరేంద్ర అధ్యక్షతన 'వైఎస్సార్ ఆసరా' వారోత్సవ సభ నిర్వహించారు. హిందూపురం మండలంలోని 890 డ్వాక్రా సంఘాల గ్రూపులకు సంబంధించి 9,792 మంది మహిళలకు మూడో విడత ఆసరాగా రూ.6.32కోట్ల చెక్కును సంఘ సభ్యులకు ఎమ్మెల్సీ అందజేశారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి మహిళలతో కలిసి ఎమ్మెల్సీ క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేనిఫెస్టోను 98.5 శాతం అమలు చేశారన్నారు. చంద్రబాబు మహిళాసంఘాల సభ్యుల బ్యాంకు రుణాలన్నీ తీర్చి బ్యాంకులో పెట్టిన బంగారంతా విడిపిస్తానని చెప్పి డీఫాల్టు సంఘాలుగా చేసి అప్పుల ఊబిలో నెట్టాడని మండిపడ్డారు. అలాగే పసుపు కుంకుమ పేరుతో చెల్లని చెక్కులిచ్చి మహిళా సంఘాలను మోసం చేశారన్నారు. నేడు జగనన్న మాట చెప్పిన ప్రకారం అక్కచెల్లెమ్మలను లక్షాధికారులు చేస్తూ బ్యాంకు రుణాలన్నీ తీరుస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మరో 30ఏళ్లు ముఖ్యమంత్రిగా కొనసాగాలన్నారు. జగనన్నను మరోసారి సీఎంగా చేయాల్సిన బాధ్యత అక్కచెల్లెమ్మలపై ఉందన్నారు. మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘనీ, వైఎస్సార్‌సీపీ మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్‌రెడ్డి, జెడ్పీటీసీ నాగభూణం, మార్కెట్‌యార్డు మాజీ వైస్ చైర్మన్ పురుషోత్తంరెడ్డి, నాయకులు బసిరెడ్డి, రాము, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

గంగమ్మ దేవతకు ఎమ్మెల్యే పూజలు



కోగిరలో గంగమ్మదేవి పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే శంకరనారాయణ

రొద్దం: కోగిర గ్రామంలో శుక్రవారం నిర్వహించిన గంగమ్మ అమ్మవారి గ్రామోత్సవంలో ఎమ్మెల్యే శంకరనారాయణ పాల్గొని, ప్రత్యేక పూజలు చేయించారు. కార్యక్రమంలో సర్పంచ్ రమాదేవి, ఎంపీపీ చంద్రశేఖర్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బి.నారాయణరెడ్డి, కన్వీనర్ బోయ తిమ్మయ్య, స్థానిక నాయకులు శ్రీరాములు, రవి, గోపాల్, రామకృష్ణ, నాగేంద్ర స్వామి, కురుబ మారుతి పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి ప్రాధాన్యత

మడకశిర: మడకశిర మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ తెలిపారు.శుక్రవారం ఆమె అధ్యక్షతన మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో కౌన్సిల్ సమావేశం జరిగింది.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నామని, ఇందుకు అధికారులు సహకరించాలన్నారు. కౌన్సిలర్లు ఆయా వార్డుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి ,వైస్ చైర్‌పర్సన్ వెంకటలక్ష్మమ్మ, కమిషనర్ ప్రభాకర్ రావు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

చంద్రబాబువి పగటి కలలు

- ఎమ్మెల్యే తిప్పేస్వామి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిర: చంద్రబాబు పగటి కలలు కంటున్నారని, టీడీపీ అధికారంలోకి రావడం సాధ్యం కాని పని అని స్థానిక ఎమ్మెల్యే తిప్పేస్వామి అన్నారు. శుక్రవారం పట్టణంలోని షిర్డీ సాయిబాబా ఆవరణలో నియోజకవర్గ స్థాయి సచివాలయం కన్వీనర్ల సమావేశం జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ మళ్లీ వైఎస్సార్‌సీపీ విజయం సాధించడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ విజయాన్ని ఆపడం ఎవరితరం కాదన్నారు. కేవలం నాలుగు ఎమ్మెల్సీ స్థానాల్లో గెలిచిన టీడీపీ నాయకులు అప్పుడే అధికారంలోకి వచ్చినట్లు కలలు కంటున్నారని ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల్లో సచివాలయం కన్వీనర్లు కీలక పాత్ర పోషించాల్సి ఉంటుందని తెలిపారు. పార్టీ గెలుపే ధ్యేయంగా పని చేయాలని కోరారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను ప్రజలకు వివరించాలన్నారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా సిద్ధంగా ఉండాలని కోరారు. సచివాలయ కన్వీనర్లు చేయాల్సిన పనులను ఎమ్మెల్యే వివరించారు. జేసీఎస్ కన్వీనర్లు నాగేంద్ర, శివకుమార్, విక్రమ్, రొళ్ల నాగేంద్ర, శ్రీనివాసరెడ్డి, శివన్న తదితరులు పాల్గొన్నారు.

అధికారుల తీరుపై సభ్యుల ఆగ్రహం



సమావేశంలో పాల్గొన్న సభ్యులు

హిందూపురం: కౌన్సిల్‌లో అధికారులే లేరు. ఆఫీసులో సగం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సమస్యలు ఎవర్ని అడగాలని కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో కౌన్సిలర్ శివ, ఆసీఫ్‌వుల్లా మాట్లాడుతూ కేవలం 1వ వార్డుకే రూ.లక్షల నిధులు కేటాయించడం ఏమిటి? మిగిలిన వార్డుల్లో సమస్యలు లేవా ఎందుకు వివక్ష చూపుతున్నరన్నారు. సెంటర్ లైటింగ్ విషయంలో ఇంజినీరింగ్ అధికారులు చేతివాటం చూపుతున్నారు. వాస్తవ ధరలకంటే అధిక రేట్లు చెల్లించడానికి సిద్ధమయ్యారు. కాంట్రాక్టర్‌పై ఎందుకంత ప్రేమ చూపుతున్నారు. ఏదైనా అడిగితే ఎస్ఎస్ఆర్ రేట్లు అని దాటవేస్తున్నారని విమర్శించారు. అయినా ఇంతవరకు లైట్లు ప్రారంభించలేకపోయారన్నారు. సంతం వసూలు కాంట్రాక్టర్లు ఏడాదిపాటు వసూళ్లు చేసుకుని మున్సిపాల్టీకి కట్టకుండా తిరిగి మరోసారి వేలాలు దక్కించుకుంటూ పోతుంటే మిగిలిన బకాయిలు రూ.లక్షలు మున్సిపాల్టీకి గండి పడుతోందని కౌన్సిలర్ నాగేంద్రబాబు తెలిపారు. కౌన్సిలర్ శివ మాట్లాడుతూ 95/2 సర్వే నెంబర్‌లో రిలయన్స్ పెట్రోల్ బంకు వద్ద ఓ కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణానికి టౌన్‌ప్లానింగ్ అధికారులు నిబంధనలు తుంగలో తొక్కి సొంత లబ్ధికి పాల్పడి మున్సిపాల్టీకి రూ.లక్షలు పన్ను రాబడికి గండి కొట్టారని ఆరోపించారు.

ఎమ్మెల్సీ ఆపన్నహస్తం

హిందూపురం: వెన్నెముక సమస్య కారణంగా అనారోగ్యంగా ఉన్న బాలుడి పరిస్థితి చూసి చలించిన ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ ఆపన్నహస్తం అందించి ఆర్థిక సాయంతోపాటు ఆపరేషన్‌కు అవసరమైన ఏర్పాట్లు చేసి మానవత్వం చాటుకున్నారు. పట్టణంలోని 3వ వార్డుకు చెందిన లావణ్య కుమారుడు ఎనిమిదేళ్ల బాలుడు వరణ్ వెన్నెముకలో సమస్య కారణంగా నిలవడానికి, నడవడానికి ఇబ్బంది ఏర్పడింది. ఆపరేషన్‌కు రూ.లక్షలు ఖర్చు అవుతుందని, తమవద్ద అంతస్తోమత లేదని ఎమ్మెల్సీ వద్ద తల్లి లావణ్య వాపోయింది. స్పందించిన ఎమ్మెల్సీ వెంటనే రూ.50 వేలు ఆర్థిక సాయం అందించారు. అలాగే వైఎస్సార్‌సీపీ నాయకుడు లతీఫ్‌ను బాలుడి తల్లి వెంట బెంగళూరులోని మహావీర్ జైన్ ఆస్పత్రికి పంపించి వైద్యులతో పరీక్షలు చేయించారు. సర్జరీకి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. మిగిలిన మొత్తాన్ని పార్టీ నాయకులు, సామాజిక వర్గం వారిచే కొంత సర్దుబాటు చేసి ఆపరేషన్‌కు అవసరమైన అన్ని చర్యలు చేయించారు. ఎమ్మెల్సీకి రుణపడి ఉంటామని బాలుడి తల్లి లావణ్య ధన్యవాదలు తెలిపింది.

పౌరహక్కులపై అవగాహన పెంచుకోండి

చిలమత్తూరు: పౌరహక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సబ్ కలెక్టర్ కార్తీక్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని దేమకేతేపల్లి ఎస్సీ కాలనీలో ప్రజలకు పౌరహక్కులపై సబ్ కలెక్టర్ అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో అంటరానితనాన్ని రూపుమాపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సమానత్వం ముఖ్యమని, కులమతాలలకు అతీతంగా కలిసి ఉండాలన్నారు. అనంతరం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు, ఇన్‌చార్జి ఎంపీడీఓ రామ్‌కుమార్, ఎంపీటీసీ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు...

యువకుడి మృతి

సోమందేపల్లి: కదిరేపల్లి గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన హేమంత్‌కుమార్ (29) శుక్రవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పెనుకొండ మండలం చంద్రగిరికి చెందిన హేమంత్‌కుమార్ రంగేపల్లి వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స కోసం అనంతపురానికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా గోవర్ధన్‌రెడ్డి

మడకశిర: మడకశిర బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సీనియర్ న్యాయవాది వైసీ గోవర్ధన్‌రెడ్డి మళ్లీ ఎన్నికయ్యారు. శుక్రవారం బార్ అసోసియేషన్ కార్యాలయంలో ఎన్నిక జరిగింది. వరుసగా మూడోసారి వైసీ గోవర్ధన్‌రెడ్డి బార్ అసోసియేషన్

సంక్షిప్త సమాచారం

అధ్యక్షుడిగా ఎన్నిక కావడం విశేషం. ఉపాధ్యక్షుడిగా లోకేశ్, కార్యదర్శిగా విజయభాస్కర్, సంయుక్త కార్యదర్శిగా బాబునాయక్, కోశాధికారిగా హనుమంతరాయుడు, లైబ్రరీ ఇన్‌చార్జ్‌గా క్రిష్ణమూర్తి ఎన్నికయ్యారు.

పెనుకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా నాగరాజు

పెనుకొండ: పెనుకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా నాగరాజు ఎన్నికయ్యారు. బార్ అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా నాగరాజు, ఉపాధ్యక్షుడిగా మహమ్మద్ సనాజ్, ప్రధాన కార్యదర్శిగా కమలాకర్‌రెడ్డి, సహాయ కార్యదర్శిగా వినోద్‌నాయక్, లైబ్రరీ సెక్రటరీగా విక్రాంత్‌నాయక్, ఈసీ మెంబర్లుగా శ్రీరాములు, అబూబకర్ ధర్మేంద్రరెడ్డి, అశ్వర్థనారాయణ, అబ్దుల్ ముజీబ్‌లు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా నాగేశ్వరి, నరేందర్‌రెడ్డి వ్యవహరించారు.

జూదరుల అరెస్ట్

సోమందేపల్లి: చెన్నాపురం సమీపంలో పేకాట ఆడుతున్న ఏడుగురిని శుక్రవారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. వారి నుంచి రూ.6,500 నగదు స్వాధీనం చేసుకున్నమన్నారు.

లేపాక్షి: మైదుగోళం సమీపంలో పేకాట స్థావరాలపై ఎస్ఐ మునీర్‌అహమ్మద్ ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించారు. 8 మందిని అరెస్ట్ చేసి రూ.81 వేలు నగదుతో పాటు నాలుగు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు.

వాల్మీకులకు లోకేష్ క్షమాపణ చెప్పాలి

సోమందేపల్లి : టీడీపీ నేత లోకేష్ వాల్మీకులకు క్షమాపణ చెప్పాలని వైఎస్సార్ సీపీ మాజీ మండల కన్వీనర్ వెంకటరత్నం డిమాండ్ చేశారు. శుక్రవారం సోమందేపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. యువగళం పాదయాత్ర వాల్మీకి విగ్రహం ముందు నుంచే సాగినా కనీసం విగ్రహానికి పూలమాల వేయకుండా వాల్మీకులను అవమానపరిచారన్నారు. ఎమ్మెల్యే శంకరనారాయణ అన్ని విధాలుగా మండలంలో అభివృద్ధి పనులు చేశారన్నారు. మాజీ ఎమ్మెల్యే బీకే పార్థసారథి క్వారీల పేరిట దోచుకున్నారని, సోమందేపల్లి చెరువులో ఏకంగా రోడ్డు వేయించి రైతుల మనోభావాలు దెబ్బతీశారన్నారు. మరోసారి ఎమ్మెల్యేపైన అవాస్తవాలు ప్రచారం చేస్తే ప్రజలే తగిన బుద్ధి చెప్తారన్నారు. నాయకులు నరసింహమూర్తి, ఎల్లారెడ్డి, ఆనంద్, ఈశ్వర్‌రెడ్డి, ఇమాంవలి, సర్పంచ్ అంజినాయక్ ఉన్నారు.

ఐసీడీఎస్ కార్యాలయం ప్రారంభం

సోమందేపల్లి: మండల కేంద్రంలో ఐసీడీఎస్ కార్యాలయాన్ని పెనుకొండ సీడీపీఓ శాంతలక్ష్మి శుక్రవారం ప్రారంభించారు. ప్రాజెక్టుల విలీనం అనంతరం పరిగి, గోరంట్ల, సోమందేపల్లి మండలాలను కలుపుతూ సీడీపీఓ కార్యాలయాన్ని ఇక్కడ ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. ఎడీపీ ఓలు అనురాధ, రెడ్డి రమణమ్మ పాల్గొన్నారు.

మూడు నెలల్లోపు బ్రిడ్జి నిర్మించాలి

- రూ.20 కోట్లతో రోడ్ల నిర్మాణ పనులు
- ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ



బ్రిడ్జి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

రొద్దం: మూడు నెలల్లోపు బ్రిడ్జి పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ అన్నారు. శుక్రవారం మండలంలోని నారనాగేపల్లి పెన్నానదిపై కాజ్‌వే నిర్మాణానికి ఎమ్మెల్యే శంకరనారాయణ భూమి పూజ చేసి, పనులుప్రారంభించారు. మొదటి పెన్నానదిలో వినాయక చిత్రపటానికి పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శంకుస్థాపన, భూమి పూజ చేసి శిలాఫలకం ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నారనాగేపల్లి నుంచి గౌరాజుపల్లి మీదుగా రొద్దం వెళ్లాలంటే ప్రజలు ఇబ్బందులు పడేవారన్నారు. పెన్నానది ప్రవాహం తగ్గే వరకూ ప్రయాణానికి ఇబ్బందులు పడేవారన్నారు. రూ.20 కోట్లతో పావగడ - పెనుకొండ ప్రధాన రహదారి క్రాస్ నుంచి పెద్దగువ్వలపల్లి మీదుగా దొడగట్టవద్ద కర్ణాటక రాష్ట్ర సరిహద్దు వరకు రెండు లేన్ల తారురోడ్డు నిర్మాణం, పెద్దకోడిపల్లి క్రాస్ నుంచి నారనాగేపల్లి, నారనాగేపల్లి నుంచి ఎం.కొత్తపల్లి క్రాస్ వరకూ రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు ఆర్‌అండ్‌బీ డీఈ నాగరాజు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఎస్ఈ ఓబులకొండారెడ్డి, ఏఈ వెంకటేసులు, ఎంపీపీ చంద్రశేఖర్, స్థానిక సర్పంచ్ నాగార్జున, ఎంపీటీసీ గొల్ల పద్మావతి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బి.నారాయణరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బోయ తిమ్మయ్య, సచివాలయాల సమన్వయకర్త ఆర్‌పి రవిశేఖర్‌రెడ్డి, కలిపి, రొద్దం సింగిల్ విండో చైర్మన్లు కేపీ శ్రీనివాసులు, లక్ష్మీనారాయణరెడ్డి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ రాజారెడ్డి, స్థానిక నాయకులు ఆవుల లక్ష్మీనారాయణరెడ్డి, మాజీ సుబ్రహ్మణ్యం, వేణు, మాజీ డీలర్ లక్ష్మీనారాయణప్ప, వార్డు మెంబర్ నాగరాజు, డీలర్ మహేశ్వరరెడ్డి, హనుమంతరెడ్డి, రాధప్ప, శివసాయి కన్‌స్ట్రక్షన్స్ కాంట్రాక్టర్ రమేష్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

భూ నిర్వాసితులకు పరిహారం పంపిణీ



బాధిత రైతుకు చెక్కు అందిస్తున్న సబ్ కలెక్టర్ కార్తీక్

మడకశిరరూరల్: కర్ణాటక రాష్ట్రం తుముకూరు నుంచి పావగడ వరకు ఏర్పాటు చేస్తున్న తాగునీటి పైపులైన్‌కు భూములు కోల్పోయిన బాధిత రైతులకు శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్ చెక్కుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ తాగునీటి పైపులైన్ ఏర్పాటుతో మెళవాయి రెవెన్యూ పంచాయితీ పరిధిలోని మెళవాయి, గుండుమల, కదిరేపల్లి పంచాయతీల్లో రైతులకు సంబంధించి 14.12 ఎకరాలు భూములు కోల్పోయారని తెలిపారు. ప్రస్తుతం 75 మంది బాధిత రైతులకు రూ.1.41 కోట్లు పంపిణీ చేశామన్నారు. మిగిలిన బాధిత రైతుల భూ వివరాలను పరిశీలించి పరిహారం అందిస్తామన్నారు. గోవిందాపురం పంచాయితీలో 3.10 ఎకరాలు భూములు తాగునీటి పైపులైన్‌తో కోల్పోతున్నట్లు గుర్తించామన్నారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్ బాలాంజనేయులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా రాములోరి బ్రహ్మ రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్సీ ఇక్బాల్, నవీన్ నిశ్చల్, కొండూరు వేణుగోపాల్‌రెడ్డి

చిలమత్తూరు: మండలంలోని కోడూరు మన్రోతోపులో నిర్మించిన రామాలయంలో సీతారాముల ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి బ్రహ్మరథోత్సవం వైభవంగా నిర్వహించారు. సీత, రాముడు, లక్ష్మణుడి ఉత్సవ మూర్తులను రథంలో కొలువు దీర్చి మేళ తాళ నడుమ భక్తులు జై శ్రీరామ్..జై శ్రీరామ్ అంటూ రథాన్ని లాగారు...రథోత్సవానికి ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్, ఆగ్రోస్ చైర్మెన్ నవీన్ నిశ్చల్, మాజీ సమన్వయ కర్త కొండూరు వేణుగోపాల్‌రెడ్డి,మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘని హాజరు కాగా, అర్చకులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. వారు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించినఅనంతరం రథాన్ని లాగారు.. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు.

న్యాయవాదుల సంఘం కార్యవర్గం ఏకగ్రీవం



న్యాయవాదుల సంఘ సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: స్థానిక న్యాయవాదుల సంఘం నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకుడు రామనాథం శాస్త్రి పర్యవేక్షణలో సీనియర్ న్యాయవాదులు సమావేశమై కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డి.నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా డి.ఆర్.హిదాయతుల్లాఖాన్, ఉపాధ్యక్షులుగా కేహెచ్ గోపాల్, కేవీఎల్ వన్నూరప్ప, కోశాధికారిగా జి.ఆర్.సిద్ధు, సంయుక్త కార్యదర్శులుగా రకీబ్, హెచ్.కె.వెంకటేశ్వరరావు, గ్రంథాలయ ఇన్‌చార్జ్‌గా సి.మురళి, మహిళా ప్రతినిధిగా ఎ.కళావతి ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను ఘనంగా సన్మానించి అభినందించారు. న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నూతన కమిటీ సభ్యులు అన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు రామచంద్రారెడ్డి, సత్యనారాయణ, నాగప్ప, సుదర్శన్, శివశంకర్, కృష్ణమూర్తి శ్రీరాములు, నాగరాజురెడ్డి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు శాంతియుతంగా జరగాలి

పావగడ: స్థానిక ఎస్సీ విధానసభ క్షేత్రం ఎన్నికలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా శాంతి యుతంగా జరగాలని స్థానిక ఎన్నికల అధికారి అతిక్ పాషా ఆకాంక్షించారు. స్థానిక తాలూకా కార్యాలయం మీటింగ్ హాలు లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మే 10న ఎన్నికల పోలింగ్, 13 న ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిర్వహిస్తారన్నారు. ఈ నెల 13 న గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేస్తారని, 20 న నామినేషన్లు దాఖలుకు చివరి రోజు అని తెలిపారు. 21 న నామినేషన్ల పరిశీలన, 24 నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందన్నారు. విధాన సభ క్షేత్రం లో 1,92,087 మంది ఓటర్లు, 137 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయన్నారు.

సక్రమంగా స్టాక్‌పాయింట్ నిర్వహణ

మడకశిర: నిత్యావసర సరుకుల స్టాక్ పాయింట్‌ను సక్రమంగా నిర్వహించాలని పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్ ఆదేశించారు. ఆయన శుక్రవారం మడకశిర స్టాక్ పాయింట్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాకు రిజిస్టర్‌ను పరిశీలించడంతోపాటు స్టాకు వివరాలపై ఆరా తీశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టాక్ పాయింట్ నుంచి నిత్యావసర సరుకులు సమయానికి డీలర్లకు అందించాలన్నారు. తూకాలు సక్రమంగా ఉండేలా చూడాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ బాలాంజనేయులు, స్టాక్ పాయింట్ అధికారి ప్రసాద్ ఉన్నారు.